సాక్షి ప్రకాశం

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



ఏళ్లతరబడి ఎనలేని సేవలు

75 ఏళ్లుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 56 ఏళ్లు గా ఉన్న జూనియర్ కాలేజీ వజ్రోత్సవ, స్వర్ణోత్సవ సంబరాలకు ముస్తాబయ్యాయి.

- 8లో..



మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు

మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన ఘటన సింగరాయకొండ మండలంలో జాతీయ రహదారిపై జరిగింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం 33/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్


పాతికేళ్ల సంకల్పం ఇంతింతై..

- ఆర్టీసీ బస్టాండ్‌లో పాతికేళ్ల క్రితం నాటిన మొక్కలను చూసేందుకు వచ్చిన రిటైర్డ్ ఈడీ
- మొక్కలు పెంచి సంరక్షించిన ఆర్టీసీ మేస్త్రీలకు సత్కారం



మేస్త్రీలను సత్కరిస్తున్న రిటైర్డ్ ఆర్టీసీ ఈడీ

చీమకుర్తి: ఒంగోలు ఆర్టీసీ ఆర్‌ఎంగా 25 సంవత్సరాల క్రితం పనిచేసి ప్రస్తుతం రిటైర్డ్ ఆర్టీసీ ఈడీ, వృక్షమిత్ర రాష్ట్ర ఫౌండర్‌గా ఉన్న ఎంవీ నాగవేంద్రరావు శనివారం చీమకుర్తి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు చక్కటి నీడనిస్తున్న మహా వృక్షాలను చూసేందుకు వచ్చారు. ప్రయాణికులకు నీడనిచ్చేందుకు నాగవేంద్రరావు చొరవతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అనేక మొక్కలను స్వయంగా ఆయన దగ్గరుండి నాటించారు. తదుపరి బదిలీలు, పదోన్నతులతో చివరకు ఆర్టీసీ ఈడీగా రిటైర్ అయి హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. అయినా చీమకుర్తి బస్టాండ్ ఆవరణలో తాను నాటించిన మొక్కలు నేడు మహా వృక్షాలైన సంగతి తెలుసుకొని వాటిని సంరక్షించిన స్థానిక ఆర్టీసీ మేస్త్రీలను పలకరించి వృక్షాలను చూసేందుకు వచ్చారు. ఆయనతో పాటు ప్రస్తుత ఒంగోలు ఆర్‌ఎం బీ.సుధాకర్, ఒంగోలు, కనిగిరి డీఎంలు శ్రీనివాసరావు, షయనాజ్, లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ బీ.జవహర్, కంట్రోలర్ పరాంకుశం శ్రీనివాసమూర్తితో పాటు ఆర్టీసీ సిబ్బంది ఆయన వెంట వచ్చారు. తను నాటిన మొక్కలు పెద్ద వృక్షాలుగా మారటంతో పట్టరాని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆయా మొక్కలను పెంచి పెద్ద చేసి సంరక్షించిన మేస్త్రీలు చాంద్‌బాషా, చింతగింజల సుబ్బారావు, ఎనిమిరెడ్డి ఎరుకలరెడ్డిని శాలువాలతో పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం మళ్లీ బస్టాండ్ ఆవరణలో మరో మూడు మొక్కలను నాటించి స్థానికులకు స్ఫూర్తినిచ్చారు.



ఉద్యోగుల్లో కూటమి దడ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు పెరిగిపోయాయి. టీడీపీ నాయకులు తమ అక్రమ వ్యాపారాలకు, దౌర్జన్యాలకు సహకరించాలంటూ అధికారులను బెదిరిస్తున్నారు. మాటవినని వారిపై దాడులకు తెగబడుతున్నారు. వారికి టీడీపీ ఎమ్మెల్యేలూ వత్తాసు పలుకుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోకుండా పోలీసులపై ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక ప్రభుత్వ ఉద్యోగుల్లో అభద్రతా భావం నెలకొంది.

- కూటమి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులపై పెరిగిన దాడులు
- వరుస దాడులతో ఉద్యోగుల బెంబేలు
- అధికార మదంతో రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- మాట వినకపోతే దాడులు, బదిలీల బహుమానం
- జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగుల్లో అభద్రత

ఒంగోలు టౌన్:

''పచ్చ బిళ్ల తీసుకొని వచ్చిన టీడీపీ కార్యకర్తలను కూర్చోపెట్టి, టీ ఇచ్చి.. చెప్పిన పనులు చేసి పంపించాలి'' కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి చెప్పిన మాటలివి. మంత్రులే అలా ఉంటే ఇక తెలుగు తమ్ముళ్ల సంగతి చెప్పేదేముంది. తమకు అడ్డెవరన్నట్లు రెచ్చిపోతున్నారు. అక్రమ వ్యాపారాలకు సహకరించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. మాట వినని వారిపై దాడులకు పాల్పడుతున్నారు. మొన్న గ్రూప్ ఒన్ అధికారి, నిన్న పోలీసు కానిస్టేబుల్, తాజాగా రైల్వే ఉద్యోగిపై వరస దాడులు జరగడంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులపై దాడులకు పాల్పడుతున్న నాయకులు, కార్యకర్తలను అడ్డుకోవాల్సిన ఎమ్మెల్యేలు అందుకు విరుద్ధంగా దాడులను సమర్థించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంలో మాట్లాడేందుకు ఉద్యోగ సంఘాల నాయకులు సైతం జంకుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది.

రక్షక భటుడికే రక్షణ లేదు...

రోడ్డు పక్కన హోటల్ లో టిఫిన్ చేస్తున్న ఒక కానిస్టేబుల్ మీద గత ఏడాది నవంబర్ 19న టీడీపీ నాయకుడు దాడి చేయడం కలకలం సృష్టించింది. తాలూకా పోలీసు స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ముంగమూరు రోడ్డులోని హెచ్‌పీ గ్యాస్ సమీపంలో ఒక హోటల్లో టిఫిన్ చేస్తున్నారు. రోడ్డు పక్కన మోటారు బైకు నిలిపి ఉంచారు. అదే సమయంలో కారులో అటుగా వచ్చిన నగరంలోని శివ ప్రసాద్ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు బోడపాటి రాంబాబుకు రోడ్డు పక్కన నిలబెట్టిన మోటారు బైకు అడ్డం ఉన్నట్లు కనిపించింది. బైకు అడ్డం తీయమంటూ బూతులు లంకించుకున్నాడు. దాంతో హోటల్ లో టిఫిన్ చేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాస రావు బయటకు వచ్చి బైకు తీసేశారు. అయినా శాంతించని రాంబాబు తిడుతూ కానిస్టేబుల్ మీద దాడికి దిగాడు. ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. ఆయన మీదకు కారు ఎక్కించే ప్రయత్నం చేశాడు. ఈ ఘటన జరిగిన కొద్ది సేపటికే అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల నుంచి తాలూకా పోలీసు స్టేషన్ కు ఫోన్ వచ్చినట్లు ప్రచారం జరిగింది. రాంబాబు మీద కేసు పెట్టకుండా రాజీ చేసేందుకు ఒత్తిడి చేసినట్లు పోలీసు వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. రోజుల తరబడి కథ నడిపిన తరువాత ఒక రోజు సాయంత్రం రాంబాబును అరెస్టు చేసినట్లు చూపించి నోటీసు ఇచ్చి ఇంటికి పంపించారు. ఏకంగా పోలీసుల మీద దాడి పాల్పడినా నిందితుడిని కఠినంగా శిక్షించకుండా మర్యాద చేసి వదిలి పెట్టడంతో పోలీసు వర్గాలు విస్మయానికి గురయ్యాయి.

సంతకాలు చేయలేదని హత్యాయత్నం...

విజయవాడకు చెందిన టీడీపీ నాయకుడు తాణికొండ రాధాకృష్ణ ఒంగోలుతో పాటు తెనాలి, భీమవరం, గుడూరు రైల్వే స్టేషన్లలో క్లీనింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. ప్రతినెలా బిల్లులు పెట్టుకోవాల్సి ఉండగా నిబంధనలకు వ్యతిరేకంగా ఒకేసారి 4 నెలల బిల్లులపై సంతకాలు చేయమంటూ రాధాకృష్ణ సోదరుడు గిరిధర్ ఈ నెల 5 వ తేదీన ఒంగోలు రైల్వే స్టేషన్ కు వచ్చి రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ నంద కిషోర్ యాదవ్ పై ఒత్తిడి చేశారు. ఫైళ్లు పరిశీలించేందుకు కొంత సమయం ఇవ్వమని అడిగినందుకు ఆయన చొక్కా పట్టుకొని కొట్టారు. అతడి నుంచి తప్పించుకున్న నంద కిషోర్ ప్రాణ భయంతో పరుగులు పెట్టారు. దగ్గరలో ఉన్న జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తన మీదనే ఫిర్యాదు చేస్తావా అంటూ రెచ్చిపోయిన గిరిధర్ ఆఫీసులోనే హెల్త్ ఇన్‌స్పెక్టర్ పై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ దాడిలో నందకిషోర్ చేయి విరిగింది.



చికిత్స పొందుతున్న నందకిషోర్ యాదవ్ (ఫైల్)

దాడులపై ఎమ్మెల్యేల జోక్యం...

అధికారుల మీద దాడులు చేసిన వారిపై వెంటనే పోలీసులు కేసు నమోదు చేయకుండా, ఒక వేళ చేసినా నిందితులను అరెస్టు చేయకుండా అధికార పార్టీ ఎమ్మెల్యేలు అడ్డుకుంటున్నారని ఉద్యోగుల్లో ప్రచారం జరుగుతోంది. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేయడాన్ని గత ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకునేవి. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా అధికార పార్టీ నాయకులే స్వయంగా దాడికి పాల్పడం దుర్మార్గమని ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు ఇటీవల కొందరు పోలీసులను ఇంటికి పిలిపించుకొని తమ మాట వినకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించినట్లు ప్రచారం జరుగుతోంది.

ఉద్యోగుల్లో భయాందోళనలు...

వరుస దాడులతో ఉద్యోగులు అభద్రతతో ఆత్మరక్షణలో పడిపోయారు. దాడులకు వ్యతిరేకంగా మాట్లాడితే ఏమౌతుందోనన్న భయంతో మౌనంగా ఉంటున్నారు. ఉద్యోగ సంఘాల నాయకులు సైతం నామ మాత్రపు ఖండనలతో సరిపుచ్చుతున్నారు. బుధవారం రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ నంద కిషోర్ యాదవ్ మీద ఆయన కార్యాలయంలోనే దాడి చేసినప్పటికీ ఈ ఘటన గురించి మాట్లాడేందుకు ఉద్యోగులు ఎవరూ ధైర్యం చేయకపోవడం గమనార్హం.

గ్రూప్ వన్ ఆఫీసర్‌కే దిక్కులేదు...



ఆస్పత్రిలో ఉన్న రాజశేఖర్ (ఫైల్)

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సరిగ్గా రెండు నెలలకే జిల్లా కేంద్రంలో ఒక గ్రూప్ వన్ అధికారి మీద దాడి జరగడం సంచలనం సృష్టించింది. జిల్లా సహకార సంఘంలో డీసీఏవోగా పనిచేసే రాజశేఖర్ నిజాయితీ కలిగిన అధికారిగా పేరొందారు. జిల్లాలోని సహకార సంఘాల్లో అవినీతి పట్ల కఠినంగా వ్యవహరించారు. కొన్ని సంఘాల మీద విచారణకు ఆదేశించారు. మరికొన్నింటి మీద భారీ జరిమానా విధించారు. దీంతో ఆయనను దారిలోకి తెచ్చుకునేందుకు కొందరు ఉద్యోగులు, టీడీపీ నాయకులు ప్రయత్నించారు. ముక్కుసూటిగా వ్యవహరించే రాజశేఖర్ వినలేదు. దాంతో ఆయన మీద సెప్టెంబర్ 8వ తేదీ ఆఫీసు నుంచి ఇంటికి వెళుతుండగా దాడి చేశారు. కర్రలతో తీవ్రంగా కొట్టారు. దాడి ఘటన సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. వెంటనే రంగంలోకి దిగిన డీఎస్పీ రాయపాటి శ్రీనివాస రావు, వన్ టౌన్ సీఐ నాగరాజు దాడి జరిగిన తీరును పరిశీలించారు. తన కార్యాలయంలో పనిచేసే కొంతమంది సిబ్బందిపై రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. ఈ దాడిలో అధికార పార్టీ నాయకుల హస్తం ఉండడంతో పెద్దల ఒత్తిడి మేరకు కేసును నీరుగార్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. చివరికి డీసీఏఓ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలకు తెరదీశారు. ఈ మొత్తం వ్యవహారంలో ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రభుత్వంలో కీలకమైన ఒక గ్రూప్ వన్ అధికారికే రక్షణ కల్పించలేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజా సంఘాలు నిలదీశాయి. దీంతో కొందరు ఇంటి దొంగలతో పాటుగా మరి కొందరు అధికార పార్టీ నాయకులను కలుపుకొని మొత్తం ఆరుగురిని అరెస్టు చేసి చేతులు దులుపుకున్నారు.

మిర్చి రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలి

- నష్టపోయిన మిరప రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి
- కూటమి ప్రభుత్వంలో దళారులదే రాజ్యం
- క్వింటా రూ.25 వేలకు కొనుగోలు చేయాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ డిమాండ్



మిర్చి రైతులతో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ

ముండ్లమూరు(దర్శి): జిల్లాలోని మిర్చి పంటలు వేసిన రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారంలో మిర్చి రైతులను శనివారం బూచేపల్లి పరామర్శించారు. వారి కష్ట నష్టాలు తెలుసుకునేందుకు మిరప రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు తమ ఆవేదనను బూచేపల్లితో వెలిబుచ్చారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదని చెప్పారు. కల్తీ మందులతో తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. బ్యాంకుల్లో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టామని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం వలన మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వంలో క్వింటా మిరప ధర రూ.25 వేలు ఉండగా, ఇప్పుడు కనీసం రూ.11 వేలు కూడా లేదని చెప్పారు. గత ప్రభుత్వంలో రైతులకు మిరప పంట దిగుబడులు బాగా వచ్చాయన్నారు. ఈ ప్రభుత్వంతో కల్తీ పురుగు మందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా సీఎం చంద్రబాబు వాటిని అరికట్టలేకపోయారని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీలు ఇస్తూ, రైతు భరోసా కల్పించారని, పంటలకు ఉచిత బీమా కల్పించి, నష్టపోయిన రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. చంద్రబాబు అబద్ధపు హామీలు ఇచ్చి రైతులను నిలువునా మోసగించారన్నారు. ప్రతి ఏడాది రైతులకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఎనిమిది నెలలు గడిచినా రూపాయి విదిల్చిన పాపాన పోలేదన్నారు. పంట నష్ట పోయిన రైతుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో దళారులు రాజ్యమేలుతున్నారని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వడ్డీల కు తెచ్చుకుని పంటలు వేసుకున్న రైతులు ఆ వడ్డీలు ఎక్కడ పెరుగుతాయో అని తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సి వస్తోందని చెప్పారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, లేదంటే ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, గ్రామ సర్పంచ్ వేముల శ్రీను, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బంకానాగిరెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ సూదిదేవర అంజయ్య, చింతల అంజిరెడ్డి, చింతల కృష్ణారెడ్డి, సోమేపల్లి సుబ్బయ్య, మాజీ ఎంపీటీసీ గుజ్జులశ్రీను, నాయకులు పాల్గొన్నారు.

పేద రోగులకు మెరుగైన వైద్యం అందించండి




సమావేశంలో మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

- పీహెచ్‌సీని సందర్శించిన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేక ప్రభుత్వం ఆస్పత్రులకు వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సూచించారు. స్థానిక సీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన బూచేపల్లి అక్కడ ఓపీ రాయించుకుని ఉన్న రోగులను ఆప్యాయంగా పలకరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆస్పత్రికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలో మార్చురీ గది నిర్మాణం త్వరితగతిన చేపట్టాలన్నారు. ఆపరేషన్ థియేటర్ సామగ్రి, బెడ్స్, అత్యవసర మందుల కొనుగోలుకు ఆస్పత్రి ఆవరణలో డోజర్‌తో చదును చేసి పిచ్చి చెట్లు తొలగించేందుకు నిధులు ఖర్చు చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో సిబ్బంది ప్రజలకు మంచి సేవ లందించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుమన్, కమిటీ సభ్యులు సోనార్‌బాబు, జీవీ రత్నం, వైద్యులు పాల్గొన్నారు.

ముహూర్తం కుదిరింది !



- నాలుగు నెలల పాటు శుభకార్యాలకు మంచి ముహూర్తాలు
- వివాహ బంధంతో ఒక్కటి కానున్న 5 వేలకుపైగా జంటలు
- కళ్యాణ మండపాలకు డిమాండ్
- వేలాది మందికి ఉపాధి

ఒంగోలు మెట్రో: మాఘమాసం రాకతో జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి నెలకొంది. గత డిసెంబర్ నెల నుంచి జనవరి నెలాఖరు వరకు మంచి ముహూర్తాలు లేకపోవడంతో శుభకార్యాలు నిలిచిపోయాయి. ఈనెల 2వ తేదీ నుంచి మాఘమాసం రావడంతో అప్పటి నుంచి మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు మంచి ముహూర్తాలు ఉండటంతో వివాహాది శుభకార్యాలకు అనుకూలంగా ఉంటుంది. ఈ సీజన్‌లో జిల్లాలో సుమారు 5 వేలకుపైగా జంటలు వివాహ బంధంతో ఒక్కటి కానున్నాయి. ఒక్క ఈనెలలోనే వెయ్యికిపైగా వివాహాలు జరగనున్నాయి. ఇప్పటికే ముహూర్తాలు పెట్టుకున్న వారి ఇళ్లల్లో పెళ్లి హడావుడి మొదలైంది. వివాహ శుభకార్యాలకు అవసరమయ్యే కళ్యాణ మండపాలు, డెకరేషన్, క్యాటరింగ్ నిర్వాహకులు, పురోహితులకు మంచి గిరాకీ ఏర్పడింది. కళ్యాణ మండపాలకు ముందస్తు బుకింగ్‌లు చేసుకుంటున్నారు. ధరలు కూడా గతం కంటే ఈసారి ఎక్కువగా ఉన్నాయి. శుభకార్యాల సీజన్‌తో వివిధ వర్గాల వారికి చేతి నిండా పనిదొరుకుతోంది. డెకరేషన్, క్యాటరింగ్, భజంత్రీలు, పురోహితులు, పూలవ్యాపారులకు ఉపాధికి ఇబ్బంది లేకుండా ఉంటోంది. వస్త్ర, బంగారు వ్యాపారాలకు కూడా ఇది మంచి సీజన్. జిల్లాలో 150 కళ్యాణ మండపాలు ఉండగా, ఒంగోలు నగరంలోనే 36 ఉన్నాయి. ఏసీ కళ్యాణ మండపానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మండప నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. నాదస్వర కళాకారులు ఒంగోలులో 350 మంది ఉండగా, జిల్లా వ్యాప్తంగా 3 వేల మందికిపైగా ఉన్నారు. ఒంగోలు నగరంలో వివాహాది శుభకార్యాలు చేయించే పురోహితులు 80 మంది వరకు ఉండగా, జిల్లావ్యాప్తంగా 5 వేల మంది ఉన్నారు.



కళ్యాణ వేదిక

మంచి ముహూర్తాలు ఇవీ..

ఫిబ్రవరి (మాఘమాసం):
13, 14, 18, 19, 20, 21, 23, 25

మార్చి నెల (ఫాల్గుణ మాసం):
1, 2, 6, 7, 12

ఏప్రిల్ నెల (చైత్ర మాసం):
14, 16, 18, 19, 20, 21, 25, 29, 30

మే నెల (వైశాఖ మాసం):
1, 5, 6, 8, 15, 17, 18

జూన్ నెల (జ్యేష్ఠ మాసం):
1, 4, 7 తేదీలు

నాలుగు నెలల పాటు ముహూర్తాలున్నాయి



వివాహ, గృహ ప్రవేశాలకు మాఘ, ఫాల్గుణ, చైత్ర, వైశాఖ మాసాల్లో ఎక్కువ ముహూర్తాలు ఉన్నాయి. జ్యేష్ఠమాసంలో మూడే బలమైన ముహూర్తాలు ఉన్నాయి. దీంతో ఆ తేదీల్లో అధిక సంఖ్యలో వివాహ శుభ కార్యాలు జరుగుతున్నాయి.

– **పరాంకుశం సమీర్ కుమార్,** కొప్పోలు చెన్నకేశవ, ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు

కళ్యాణ మండపాలు కళకళ..



పెళ్లిళ్ల సీజన్ కావడంతో కళ్యాణ మండపాలు కళకళలాడుతున్నాయి. కళ్యాణ మండపాల అలంకరణ కోసం రకరకాల థీమ్‌లతో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఏసీ కళ్యాణ మండపానికి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు మండప నిర్వాహకులు వసూలు చేస్తున్నారు.

– **సురేష్‌బాబు,** కళ్యాణ మండపం మేనేజర్, ఒంగోలు

శుభకార్యాలను బట్టి పారితోషికం



ఈ మాసంలో గృహప్రవేశం సత్యనారాయణ వ్రతానికి ఒక డోలు, ఒక నాదస్వరానికి రూ.5 వేలు తీసుకుంటాం. అలాగే వివాహానికి ఇద్దరు డోలు, ఇద్దరు నాదస్వరానికి ఆ ముహూర్తానికి ఉన్న రోజును బట్టి రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకు పారితోషికం తీసుకుంటాం. అలాగే యజమాని ఆర్థిక పరిస్థితిని బట్టి పారితోషికం తీసుకుంటాం. ఈ సీజన్ అంతా మాకు ఉపాధికి ఢోకా లేదు.

– **సతీష్, గోపి,** నాదస్వరం, డోలు కళాకారులు, ఒంగోలు

ఈ మాసానికి మంచి డిమాండ్



పెళ్లిళ్ల సీజన్ మాఘమాసం వచ్చింది. ఈ ఫిబ్రవరి నెలలో కళ్యాణ మండపాలకి మంచి డిమాండ్ ఉంది. వివాహ శుభకార్యాలకు యజమానులు ఎంచుకున్న కళ్యాణ మండపాలను బట్టి రూ.70 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

– **కుంచాల సాయి మహేష్,** డెకరేషన్ నిర్వాహకుడు, ఒంగోలు

17న రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

రాచర్ల: మండలంలోని అనుములపల్లె గ్రామంలో జీవన మూర్తి స్వాముల వారి జెండా మహోత్సవం సందర్భంగా ఈ నెల 17వ తేదీ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ ఎడ్ల పందేలను నిర్వహిస్తున్నట్లుగా జీవనమూర్తి స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు తెలిపారు. ఎడ్ల పోటీల్లో పాల్గొనదలచిన ఎడ్ల యజమానులు అదే రోజు ఉదయం 11 గంటల లోపు రూ.500 డిపాజిట్ చెల్లించి తమ పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. ఈ ఎడ్ల పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.1,50,000, రెండో బహుమతిగా రూ.1,20,000, మూడో బహుమతిగా రూ.80 వేలు, నాల్గవ బహుమతిగా రూ.50 వేలు, ఐదో బహుమతిగా రూ.30 వేలు, ఆరో బహుమతిగా రూ.20 వేలను అందజేస్తున్నట్లుగా తెలిపారు. పూర్తి వివరాలకు 85000 88200, 98488 84683, 97056 23172, 87908 84232, 80968 89142 సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

12న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని అయ్యలూరివారిపల్లెలో మహాగణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. విజయం సాధించిన ఎడ్లజతలకు ప్రథమ బహుమతిగా రూ.1,01,116, ద్వితీయ బహుమతిగా రూ.70,116, తృతీయ బహుమతిగా రూ.50,116, నాలుగో బహుమతిగా రూ.30,116, ఐదో బహుమతిగా రూ.20,116 ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 9008377111, 9019342999 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

గ్యాస్ లీకై మంటలు చెలరేగి..

- నలుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న చెన్నమ్మ

రాచర్ల: గ్యాస్ లీకై స్టవ్ వద్ద ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగి నలుగురికి గాయాలైన సంఘటన రాచర్ల మండలంలోని పలుగుంటిపల్లె గ్రామంలో గల ఓ గృహంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామంలోని రాముకు చెందిన గృహంలో ఉదయం వంట చేసేందుకు స్టవ్ వెలిగించారు. ఆ సమయంలో గ్యాస్ లీకేజీ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. వంట చేస్తున్న చెన్నమ్మకు తీవ్రగాయాలగా, రాము, రంగలక్ష్మమ్మ, రక్షితలకు స్వల్ప గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. స్థానిక ఎస్సై పి.కోటేశ్వరరావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.

కేజీబీవీలో ఇంటర్ విద్యార్థినులు అదృశ్యం

- కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఒక్క పూటలోనే ఛేదించిన పోలీసులు

కొత్తపట్నం: మండలంలోని మోటుమాల గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు శుక్రవారం రాత్రి నుంచి కనిపించకుండా పోయారు. ఉదయం నిద్రలేచేసరికి విద్యార్థినులు లేకపోవడంతో ఎస్‌వో ఎస్.అరుణకుమారి కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై సుధాకర్‌బాబు తమ సిబ్బందితో లొకేషన్ ఆధారంగా కావలి, బిట్రగుంట ప్రాంతాల్లో గాలించారు. కావలి బస్టాండ్ సెంటర్‌లో విద్యార్థినులు ఉండటంతో వారిని ఒంగోలు తరలించి చైల్డ్ వెల్‌ఫేర్‌కు అప్పగించారు. ఆ విషయాన్ని వారి తల్లిదండ్రులకు తెలియజేశారు. పోలీసులకు స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏళ్ల తరబడి ఎనలేని సేవలు..!

- 75 సంవత్సరాలుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల
- 56 ఏళ్లుగా జూనియర్ కళాశాల ద్వారా కూడా..
- కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా విద్య
- పూర్వ విద్యార్థుల్లో ఎంతోమంది ప్రముఖులు
- నేడు పాఠశాలకు వజ్రోత్సవాలు, కళాశాలకు స్వర్ణోత్సవాలు



మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల



కడియాల యానాదయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల

మద్దిపాడు: మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల అంటే జిల్లాలో తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. 75 ఏళ్ల క్రితం 80 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ పాఠశాల ప్రస్తుతం 560 మంది విద్యార్థులతో విజయవంతంగా కొనసాగుతోంది. స్వాతంత్ర్య సమరయోధుడు, కార్పస్ ఫండ్ అందించిన దాత కడియాల యానాదయ్య పేరుమీద ఏర్పడి సుదీర్ఘకాలంగా ప్రభుత్వ విద్యారంగానికి సేవలందిస్తోంది. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దింది. వారిలో పలువురు ప్రముఖులు కూడా ఉన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా విద్యనందిస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మన్ననలు పొందుతూ నేడు వజ్రోత్సవాలు జరుపుకుంటోంది.

విద్యనభ్యసించిన పలు ప్రాంతాల వారు...

మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాలలో మద్దిపాడు మండలంలోని గ్రామాలకు చెందిన వారే కాకుండా చుట్టుపక్కల మండలాలైన కొరిశపాడు, నాగులుప్పలపాడు, పర్చూరు, తదితర మండలాల విద్యార్థులు కూడా చదువుకున్నారు. 1969లో కడియాల యానాదయ్య కుటుంబీకులు, దాతలు కలిసి లక్ష రూపాయల కార్పస్ ఫండ్‌తో జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేయడంతో చుట్టుపక్కల మండలాల విద్యార్థులు కూడా ఇక్కడకే వచ్చి చదువుకున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది. జూనియర్ కళాశాలకు అప్పట్లోనే లైబ్రరీ ఉండేది.

ఒంగోలు రిమ్స్ డైరెక్టర్‌గా పనిచేసిన బండెల అంజయ్య, హైదరాబాదులో కన్‌స్ట్రక్షన్ రంగంలో పేరు మోసిన పెండ్యాల సుబ్బారావు, గుంటూరు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాస్, ఐఏఎస్, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఆరుసార్లు పాల్గొన్న మంగమ్మ, పద్మ, రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచిన రాతికింది అచ్యుత్, డోలు వాయిద్యంలో జాతీయస్థాయిలో పేరుగాంచిన భూసరపల్లి వెంకటేశ్వర్లు, ఇలా ఎంతో మంది ప్రముఖులు మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకున్నవారే. ఇలాంటి ఉన్నత స్థానాల్లో ఉన్నవారు ఇంకా వందల సంఖ్యలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేస్తున్న పెద్దిరెడ్డి కోటిరెడ్డి కూడా ఇదే పాఠశాలలో చదువుకున్న విద్యార్థే కావడం విశేషం.

ప్రభుత్వంతో పాటు దాతల సహకారంతో అభివృద్ధి...

75 ఏళ్ల క్రితం పాఠశాల ఏర్పాటుకు మద్దిపాడు గ్రామానికి చెందిన ఆరే చెంచయ్య, ఆరే శ్రీరాములు, ఆరే రాఘవయ్య, ఆరే వెంకటసుబ్బయ్య కలిసి ఏడెకరాల 30 సెంట్ల స్థలాన్ని దానం చేశారు. అనంతరం పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు సైతం ఎవరి స్థాయిలో వారు సహాయ సహకారాలు అందించారు. ప్రభుత్వం కూడా పాఠశాల, కళాశాలల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మౌలిక వసతులన్నీ కల్పించారు. విద్యార్థులకు సరిపడా వాష్ రూములతో సహా ఇతర కనీస సౌకర్యాలన్నీ మంజూరు చేయడంతో పాఠశాలకు సకలం సమకూరాయి. విద్యార్థులతో కళకళలాడుతూ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాలు, జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్నాయి.



కడియాల యానాదయ్య విగ్రహం

170 మంది విద్యార్థులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల...

మద్దిపాడులోని కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను 75 ఏళ్ల క్రితం ప్రారంభించగా, అందులోనే 56 ఏళ్ల క్రితం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కూడా ప్రారంభించారు. ప్రస్తుతం 170 మంది విద్యార్థులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల నడుస్తూ నేడు స్వర్ణోత్సవాలు జరుపుకుంటోంది. నేటి విద్యారంగంలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల హవా నడుస్తున్నప్పటికీ మద్దిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రతి సంవత్సరం 500 మంది విద్యార్థులకు తగ్గకుండా కళకళలాడుతోంది. జూనియర్ కళాశాల కూడా మంచి పేరు తెచ్చుకుంది. 75 సంవత్సరాలుగా ఎందరో విద్యార్థులు పాఠశాలలో, 56 ఏళ్లుగా జూనియర్ కళాశాలలో చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదిగారు. తాము చదివిన పాఠశాలను గుర్తుచేసుకుంటూ అప్పుడప్పుడూ వచ్చి ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు, పాఠశాల, కళాశాలకు కావాల్సినవి సమకూరుస్తున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థానాలకు ఎదిగిన ఎంతోమంది జాతీయ స్థాయిలోనూ పాఠశాలకు పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టారు.



పాఠశాల వజ్రోత్సవాలు, కళాశాల స్వర్ణోత్సవాలకు ముస్తాబవుతున్న ప్రాంగణం

నా జీవితంలో మర్చిపోలేని ఘట్టం



ప్రస్తుతం పాఠశాలలో జరుగుతున్న ఉత్సవాలు నా జీవితంలో మర్చిపోలేని ఘట్టం. ఇక్కడే చదివిన నేను ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా రావడం, నా హయాంలోనే పాఠశాలకు వజ్రోత్సవాలు, కళాశాలకు స్వర్ణోత్సవాలు జరగడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. పాఠశాల స్వర్ణోత్సవాల సమయంలో కూడా నేను ఇక్కడే పనిచేస్తుండటం నా అదృష్టం. పాఠశాల, కళాశాలలో చదివిన విద్యార్థులంతా ఈ వేడుకలకు హాజరై విజయవంతం చేయాలి.

– పెద్దిరెడ్డి కోటిరెడ్డి, హెచ్‌ఎం, కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు



ముందు భాగం దెబ్బతిన్న కారు



ధ్వంసమైన మోటారు సైకిల్



మాల్యాద్రి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

- ఒకరు మృతి

సింగరాయకొండ: ముందు వెళ్తున్న మోటారు సైకిల్‌ను వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున సింగరాయకొండ మండల పరిధిలోని విమానాల రన్‌వేపై కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన మిడసల మాల్యాద్రి (50) వ్యక్తిగత పనిమీద కందుకూరు వెళ్లే క్రమంలో కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే సర్వీసు రోడ్డులో కాకుండా పడమర వైపు ఉన్న సర్వీసు రోడ్డులోకి వెళ్లే ప్రయత్నంలో అకస్మాత్తుగా మోటారు సైకిల్‌ను కుడివైపు తిప్పాడు. అదే సమయంలో అతని వెనుకాల వేగంగా వస్తున్న క్వాలిస్ కారు బలంగా ఢీకొట్టింది. దీంతో మోటారు సైకిల్ ధ్వంసమై మాల్యాద్రి ఎగిరిపడ్డాడు. అతని తల సిమెంటు రోడ్డుకు తగిలి అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనలో క్వాలిస్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ఈ వాహనం గుంటూరు మున్సిపల్ కమిషనర్ కార్యాలయానికి చెందినది కాగా, అందులో మున్సిపల్ కమిషనర్ కుటుంబ సభ్యులు ఇద్దరున్నారు. వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో మరో వాహనంలో వెళ్లిపోయారు. మృతి చెందిన మాల్యాద్రికి వివాహం కాగా, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం అయింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు. మాల్యాద్రి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి తరలిస్తున్న నలుగురు అరెస్ట్

ఒంగోలు సబర్బన్: ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి ఒంగోలు నగరంలో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను శనివారం పట్టుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపట్నం రోడ్డు రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఏ విజయ ఆదేశాల మేరకు ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడ నలుగురు యువకులు ద్విచక్ర వాహనాలపై వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా, వారిని తనిఖీ చేశారు. వారి వద్ద 44 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న గంజాయితో పాటు 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సంతపేటలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించారు. నలుగురినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని, న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ నరహరి వివరించారు.



నిందితులు, బైకులు, గంజాయితో ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పామూరు: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం వెలుగుచూసిన సంఘటన పామూరు మండలంలోని ఇనిమెర్ల గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనిమెర్ల గ్రామ సమీపంలోని లక్ష్మీ బాలాజీ మైన్స్ అండ్ మినరల్స్, ఉరవకొండ వద్ద గల మట్టి రోడ్డు పక్కన కంపచెట్లలోకి కొందరు బహిర్భూమికి వెళ్లగా, అక్కడ తీవ్ర దుర్వాసన వచ్చింది. పరిశీలించగా కంపచెట్లలో ఓ వ్యక్తి మృతి చెంది పడి ఉన్నాడు. స్థానిక వీఆర్‌ఓ మండ్లా శ్రీనివాసులుకు సమాచారం అందించగా, ఆయన ఫిర్యాదు మేరకు ఎస్సై టి.కిషోర్‌బాబు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెట్ల మధ్యలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీయించారు. 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసు గల పురుషుడు సుమారు 3 రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిస్తే 9121102214, 9121102215 సంబర్లకు ఫోన్‌చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిషోర్‌బాబు

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు



కూడలి నరసింహారావు



పాశం గురువారెడ్డి



ఘటన స్థలంలో ప్రమాదానికి గురైన బైకులు

పొదిలి రూరల్: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పొదిలి మండలంలోని మూగచింతల పంచాయతీలో బట్టువారిపల్లె వద్ద శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పొదిలి మండలం గురుగుపాడుకు చెందిన కూడలి నరసింహారావు కొనకనమిట్ల నుంచి పొదిలి వెళ్తున్నాడు. కొనకనమిట్ల మండలం మునగపాడు గ్రామానికి చెందిన పాశం గురువారెడ్డి పొదిలిలో పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. వీరిద్దరూ మార్గం మధ్యలోని బట్టువారిపల్లె దగ్గర ఎదురెదురుగా బలంగా ఢీకొట్టుకుని వాహనాలతో సహా కిందపడిపోయాయి. ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు ప్రథమ చికిత్స చేశారు. పాశం గురువారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.

రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న సీఐ ఖాజావలి



మ్యాచ్‌లో తలపడుతున్న క్రీడాకారులు

- తొలిరోజు వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న 30 జట్లు

కనిగిరి రూరల్:

దివంగత పులి వెంకట రమణారెడ్డి జ్ఞాపకార్థం కనిగిరిలోని కాస్మోపాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్థానిక క్లబ్ ఆవరణలో నిర్వహిస్తున్న ఈ పోటీలకు తొలిరోజు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. నరసరావుపేట-కావలి, కనిగిరి-గిద్దలూరు జట్ల మధ్య ఉత్కంఠ భరితంగా మ్యాచ్ సాగింది. తొలుత క్రీడా పోటీలను కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్, క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందడుగు వేయాలన్నారు. కార్యక్రమంలో మాకినేని నరసింహారావు, పాలకీటి చంద్రశేఖర్, ముత్యాల శ్రీనివాసులరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డి, వెన్నా శ్రీనివాసులరెడ్డి, కొల్లి సురేష్‌బాబు, మునగా ప్రసాద్, ఎస్‌కే సుమైర్, సుహైల్, రఫీ, అద్దంకి బాలరంగా, పులి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో మహిళా క్రీడాకారుల టీం భావన దీప, ఎస్‌కే సనా కౌసర్ అద్భుత ఆటను ప్రదర్శించారు. అలాగే విశ్రాంత ఎస్పీ శివారెడ్డి, ఒంగోలు ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, విజయవాడ డీఎస్పీ కోటేశ్వరరావు టెన్నిస్ ఆడారు.

ఏపీఏఈఈఏ జిల్లా కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఒంగోలు సబర్బన్: ఆంధ్రప్రదేశ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల అసోసియేషన్ (ఏపీఏఈఈఏ) జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక జలవనరుల శాఖ కన్‌స్ట్రక్షన్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎన్నికలు నిర్వహించగా, ముండ్లమూరు డీఈఈ బి.పూర్ణచందు ఎన్నికల అధికారిగా, చందలూరి తేజకుమార్ ఎన్నికల కన్వీనర్‌గా వ్యవహరించారు. జిల్లా నూతన కమిటీ అధ్యక్షునిగా బి.రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా చందలూరి తేజకుమార్, జనరల్ సెక్రటరీగా జి.శ్రీనివాసరావు, కోశాధికారిగా వి.నికేష్, వైస్ ప్రెసిడెంట్లుగా వి.వెంకటేశ్వరరెడ్డి, నరసింహారావు, జాయింట్ సెక్రటరీలుగా ఎ.దేవేంద్ర, ఆర్.పి.మంత్రూనాయక్, సంతోష్‌రెడ్డి, రఘునాయక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల అధికారి బి.పూర్ణచందును నూతన కమిటీ సభ్యులు సత్కరించారు.



ఎన్నికల అధికారి పూర్ణచందును సన్మానిస్తున్న నూతన కమిటీ సభ్యులు